క్లుప్తంగా

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో లైబ్రేరియన్ మధుసూదన్‌రావు పలు పుస్తకాలు చదివించారు. అర్థం చేసుకుంటూ పుస్తకాలు ఏ విధంగా చదవాలి, పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్యారంబోర్డు పోటీలు చేపట్టారు.

సత్కారం



రెల్లయ్యను సత్కరిస్తున్న ఎస్సై ఫక్రుద్దీన్, పోలీసు సిబ్బంది

వీరఘట్టం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన రెల్లయ్యను ఎస్సై షేక్ ఫక్రుద్దీన్‌తో పాటు స్టేషన్ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో దాకదక్ష్యంగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన రెల్లయ్యకు పదోన్నతి రావడం ఆనందంగా ఉందన్నారు. రెల్లయ్య మాట్లాడుతూ.. ఎస్సైగా పదోన్నతి పొందడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇన్నాళ్లు తనకు విధి నిర్వహణలో సహకరించిన ఎస్సైకు, సహచర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణంనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థికసాయం చేస్తున్న భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు

భామిని: మండలంలోని సతివాడకు చెందిన పున్నాన లక్ష్మణరావు(45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుని భార్య జయలక్ష్మి, ఇద్దరు పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మృతిని భార్య జయలక్ష్మికి ఆదివారం రూ.20 వేలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పాలకొండ రూరల్: మాదిగల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీఎస్ అహర్నిశలు శ్రమిస్తోందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకుడు అలజంగి చిన్నారావు అన్నారు. స్థానిక కస్పావీధిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేసి నినాదాలు చేశారు. తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న కృషిని వివరించారు. త్వరలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్ట భద్రత వస్తుందని, తమ జాతి ప్రజల్లో అభివృద్ధి వెలుగులు ప్రసరిస్తాయని అన్నారు. ఈ క్రమంలో తమ నాయకుడు మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బోగి జేమ్స్, విన్సు, టి.సంజీవి, పి.భీమారావు, యందవ మరియదాసు, సుధ, తదితరులున్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి



పూర్ణ చంద్రరావును సన్మానిస్తున్న మాజీ సైనికులు

పాలకొండ: మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దుప్పాడ పాపినాయుడు అధ్యక్షతన పాలకొండలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాజీ సైనికుల సమస్యలను తెలుసుకున్నారు. మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు, టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా విభజన కారణంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం మాజీ సైనికులు పూర్ణచంద్రరావును సన్మానించారు.

కోటదుర్గమ్మకు మొక్కుల చెల్లింపు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కోట దుర్గమ్మకు భక్తులు మొక్కులు చెల్లించారు. పాలకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఆదివారం పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఆలయానికి ఘటాలతో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. చల్లంగ చూడు కోట దుర్గమ్మ అంటూ దేవస్థానంలో ప్రణమిల్లారు. ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా వారాహి నవరాత్రులను పురస్కరించుకుని అర్చకులు లక్ష్మీ ప్రసాద్ శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

- మార్మోగిన జగన్నాథ నామస్మరణ
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



వీరఘట్టం: జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపైకి ఎక్కించేందుకు తీసుకువెళ్తున్న అర్చకులు

వీరఘట్టం: మండల కేంద్రంలో జగన్నాథ రథయాత్ర మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో అర్చకులు లింగరాజ్‌రథో ఆధ్వర్యంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథానికి అర్చకులు సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులను రథంపై గుండిచ ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రథం మీదకు ఉత్సవమూర్తులను ఎక్కించే సమయంలో భారీగా వర్షం కురిసింది. దారిపొడవునా భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. రథయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. విద్యుత్ సమస్య లేకుండా ట్రాన్స్‌కో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రథయాత్ర సందర్భంగా స్థానిక వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి రకరకాల స్వీట్లు, బొమ్మలు విక్రయించారు. దేవాదాయశాఖ ఈఓ మురళీకృష్ణ యాత్రను పర్యవేక్షించారు.

- పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు విశ్వనాథ దాస్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై అధిరోహించి గుండిచ ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ స్వామివారు తొమ్మిది రోజుల పాటు కొలువుదీరి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు.
- భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు బత్తిలిలో ఆదివారం జగన్నాథ రథయాత్ర వైభవంగా ప్రారంభమైంది. ఉత్కళీయులకు పవిత్రమైన ఆవేటి యాత్రగా పిలిచే ఈ యాత్రలో తెలుగు–ఒడియా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి జగన్నాథుడిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు ప్రతాప్‌చంద్ర సాహు జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తులకు ఆలయ మండపంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ఉత్సవమూర్తులను రథంపై అధిరోహించారు.



భామిని: బత్తిలిలో జగన్నాథ రథాన్ని లాగుతున్న భక్తులు

భక్తులు జై జగన్నాథ అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని ముందుకు లాగడంతో యాత్ర ప్రారంభమైంది. యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బత్తిలి ఎస్సై ఎస్.ప్రసాద్ తగిన చర్యలు చేపట్టారు.

ఘనంగా రథయాత్ర

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో జగన్నాథుని రథయాత్ర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయం లోపల నుంచి బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మేళతాళాలతో రథంపైకి తీసుకువచ్చారు. అనంతరం రథాన్ని గుండిచామందిరం వద్దకు తీసుకువెళ్లారు. తొమ్మిది రోజుల పాటు ఈ రథయాత్ర జరుగుతుందని ఆలయ ప్రధానార్చకుడు గిరిధర్ పాత్రో తెలిపారు. మాజీ మంత్రి పుష్పశ్రీవాణి కూడా స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు.



పాలకొండ: జగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



పూజలందుకున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కెకిగొట్టు, ఎల్విన్‌పేట గ్రామాలతో పాటు కురుపాం మండలంలోని ధూళికుప్ప గ్రామంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు రామినాయుడు మాట్లాడుతూ భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తియోగం అధ్యాయంలోని 16వ శ్లోకంలో క్షర పురుషుడు అని జీవాత్మ గురించి, అక్షర పురుషుడు అని ఆత్మ గురించి, 17వ శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి తెలియజేయడం జరిగిందని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో చాలా ముఖ్యమైనవని, వీటి ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతను ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాశారన్నారు. ఆయన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, శాస్త్రబద్ధమైన జ్ఞానాన్ని అందించారని, అదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, మద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



ధూళికుప్ప గ్రామంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ప్రజావేదిక రేపు

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు సోషల్ ఆడిట్ విభాగం ఎస్ఆర్‌పీ బి.దాసు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు, సామాజిక పింఛన్ల పంపిణీ వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం



హోమం చేస్తున్న దంపతులు

గరుగుబిల్లి: షిర్డీసాయిబాబా మందిరంలో సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, అభిషేకాలు తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం, పూజలు చేపట్టారు. ఈ హోమంలో పాల్గొంటే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

ఆధార్ లింక్ ఎప్పుడైనా చేసుకోవచ్చు..

గుమ్మలక్ష్మీపురం: గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ లింక్ ఎప్పుడైనా చేసుకోవచ్చని జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ స్పష్టం చేశారు. రెండు రోజుల్లోగా ఆధార్ లింక్ చేసుకోవాలని లేకుంటే ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వరన్న విషయాన్ని నమ్మవద్దన్నారు. గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ నంబర్‌ను ఎప్పుడైనా అనుసంధానం చేసుకోవచ్చని, దానికి చివరి తేదీ అనేదీ ఏమీ ఉండదన్నారు. ఇకమీదట డీఆర్ డిపోల పరిధిలోని వినియోగదారులకు విడతల వారీగా ఆధార్ అనుసంధానానికి తామే ఓ సమయాన్ని నిర్ణయించి, పిలుస్తామని వినియోగదారులకు తెలిపారు.

మార్కెట్‌కు భారీగా చెట్టుపనస



సీతంపేటలో ఆదివారం జరిగిన మార్కెట్‌కు భారీగా చెట్టుపనస పండ్లను గిరిజనులు తీసుకొచ్చారు. పండ్ల సైజును బట్టి ఒక్కోటి రూ.50 నుంచి రూ.150 వరకు విక్రయించారు. ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేశారు. – సీతంపేట

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కోడూరు శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. శ్రీనివాసరావు తల్లి పారమ్మ ఇటీవల స్వర్గస్తులయ్యారు. విషయం తెలియడంతో కళావతి చలివేంద్రి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అనంతరం గ్రామంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె వెంట ఎంపీటీసీ పొరెడ్డి వెంకటనాయుడు, సర్పంచ్ సిర్లాపు సుదర్శనరావు, కోడూరు సత్యంనాయుడు, సీమల అన్నంనాయుడు, కలమట గణపతి, అసిరినాయుడు, అంపిల్లి ప్రేమ్‌కుమార్, జంపు శేఖర్, తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పారిశుధ్య నిర్వహణపై దృష్టి

పాలకొండ రూరల్: పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా జగన్నాథ రథయాత్ర సందడి నెలకున్న నేపథ్యంలో అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. యాత్రా స్థలంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలన్నారు. ఉత్సవాలు ముగిసేవరకూ దేవాదాయశాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

భామిని: మండలంలోని కీసర పంచాయతీలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, అంటురోగాలు ప్రబల కుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పలరౌతు పద్మావతి, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు పలరౌతు రామకృష్ణ తెలిపారు. వీధుల్లో చెత్తపోగులను, కాలువల్లో పూడికలను తొలగించి ట్రాక్టర్ సాయంతో గ్రామ శివారులో ఉన్న చెత్త సేకరణ కేంద్రానికి తరలించారు.



భామిని: కీసరలో వీధికాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

వీధిలైట్ల వెలుగులో రథయాత్ర

వీరఘట్టం: జగన్నాథస్వామి రథయాత్రలో కనీస సదుపాయాలు లేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరఘట్టం మందిరం వీధిలోని జగన్నాథ మందిరం నుంచి ఆదివారం సాయంత్రం రథయాత్ర ప్రారంభమైంది. అయితే స్వామివారి రథంపై కనీసం లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో చీకటిలోనే యాత్ర ముందుకుసాగింది. జనరేటర్ సదుపాయం కల్పించినప్పటికీ అది పనిచేయలేదు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా వీధిలైట్ల వెలుగులోనే స్వామివారి రథాన్ని ఊరేగించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చీకటిలో ఉన్న స్వామివారు భక్తులకు కనిపించకపోవడంపై రథం వద్ద కొబ్బరికాయలు కొట్టి నిరాశతో వెనుదిరిగారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన దేవాదాయశాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వీధిలైట్ల వెలుగులో ఊరేగింపుగా వస్తున్న జగన్నాథస్వామి రథం

నేడు వైఎస్సార్ జయంతి

కొమరాడ: మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తామని, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

గరుగుబిల్లి: మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరుకావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు కోరారు.



ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డీపీఎం పి.షణ్ముఖరాజుతో కలిసి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మండల కేంద్రంలోని ఆమె స్వగృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది గణేష్‌చంద్ర, భూషణరావు, సీతారాం, జి.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సచివాలయ, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం

కొమరాడ: గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని గుణదతీలేస్ గ్రామంలో రూ.69.54 లక్షల వ్యయంతో గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పూర్ణపాడు–లాబేస్ వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌చంద్రదేవ్, నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, గులిపిల్లి సుదర్శన్‌రావు, దేవకోటి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరించి, సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ఎమ్మెల్యే పరామర్శ

కొమరాడ: ఎంపీపీ శెట్టి శ్యామలను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. శ్యామల భర్త డాక్టర్ మధుసూదన్‌రావు జూన్ 28వ తేదీన గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలంలోని మాదలింగి గ్రామంలోని ఎంపీపీ ఇంటికి ఆదివారం వెళ్లి, ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యంగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ శనపతి పావని, పొట్నూరు వెంకటి నాయుడు, వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందిపై ఆగ్రహం..

అనంతరం అదే గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి, అక్కడి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే.. సిబ్బంది హాజరు రికార్డు పరిశీలించారు. 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఒక్క స్టాఫ్‌నర్స్ నాగమణి మాత్రమే హాజరుకావడం చూసి, ఆశ్చర్యపోయారు. మిగతా వారంతా ఎక్కడని ప్రశ్నించారు. ఇలా అయితే రోగులకు సకాలంలో ఎలా సేవలందుతాయని మండిపడ్డారు. ఇప్పటికైనా సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎంపీపీ శ్యామలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తక్షణమే వైద్య సిబ్బందిని నియమించాలి

గుమ్మలక్ష్మీపురం: అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో వైద్య సిబ్బందిని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. చాలా వసతిగృహాల్లో వైద్య సిబ్బంది లేకపోవడంతో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని, ఇటీవల జియ్యమ్మవలస మండలం, రావాడ రామభద్రాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.ఈశ్వరరావు అనారోగ్యంతో ఆయన స్వగ్రామమైన గుమ్మలక్ష్మీపురం మండలంలోని బయ్యాడలో మృతి చెందాడని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించాలని, తక్షణమే వైద్యారోగ్య సిబ్బందిని ఆశ్రమ పాఠశాలల వసతిగృహాల్లో నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీతంపేటలో భారీ వర్షం



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట: సీతంపేటలో ఆదివారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వర్షాలు లేక వరినారు మడులు ఎండిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ వర్షంతో ఎండిపోతున్న నారుమడులకు జీవం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఎండలకు వరినారు మడులు ఎండిపోతున్న తరుణంలో ఇప్పుడు పడిన వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి వెదలు వేసుకునేందుకు, వరినారుకు తడి అందించేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని అన్నదాతలు అంటున్నారు.